సాగునీళ్ల వివాదంలో తమ్ముడి హత్య

- గొడ్డలితో నరికి చంపిన అన్న
- సిద్దిపేట జిల్లాలో ఘటన

శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

కోహెడ, మార్చి 5: వ్యవసాయ బావి వద్ద నీళ్ల తగాదాలతో ఓ అన్న.. తమ్ముడిని నరికి చంపాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వింజపల్లిలో మంగళవారం చోటుచేసుకున్నది. వింజపల్లికి చెందిన కొమ్ముల శ్రీనివాస్‌రెడ్డి (35), తిరుపతిరెడ్డి అన్నదమ్ములు. మంగళవారం తిరుపతిరెడ్డి బావి వద్ద ఉన్న వేప చెట్టును కూలీలను తీసుకొచ్చి కొట్టించాడు. విషయం తెలుసుకున్న తమ్ముడు శ్రీనివాస్‌రెడ్డి బావి వద్దకు వెళ్లి చెట్టును ఎందుకు కొడుతున్నావని అడిగాడు. అప్పటికే తండ్రి ఆస్తిగా వచ్చిన వ్యవసాయ బావి ఇద్దరి పొత్తుల ఉంది. అప్పటికే నీళ్ల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరుగుతుండటంతో క్షణికావేశానికి గురైన తిరుపతిరెడ్డి తమ్ముడు శ్రీనివాస్‌రెడ్డిని అక్కడే ఉన్న గొడ్డలితో మెడపై నరికాడు. గొడ్డలి కాటు తీవ్రంగా ఉండటంతో శ్రీనివాస్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నీళ్లు, చెట్టు కొట్టే విషయంలో ఇద్దరు గొడవ పడ్డట్టు సమాచారం. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి, సీఐ ఎర్రల కిరణ్, ఏసీపీ సతీశ్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఠాణాలో రౌడీ షీటర్ జన్మదిన వేడుకలు

మొగుళ్లపల్లి, మార్చి 5: జయశంకర్ జిల్లాలోని ఠాణాలో ఎస్సై ఆధ్వర్యంలో ఓ రౌడీషీటర్‌కు జన్మదిన వేడుకలు జరిపిన ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిట్యాల సర్కిల్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో రెండు రోజుల క్రితం రౌడీషీటర్ జన్మదినం జరిపారు. రౌడీషీటర్‌తోపాటు మరికొందరు కేక్‌తో పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. రౌడీషీటర్ ఎస్సై సామాజికవర్గానికి చెందినవాడు కావడంతో అంతా కలిసి వేడుకలు జరుపుకోగా, కొందరు ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో ఓ పోలీస్ ఉన్నతాధికారి సదరు ఎస్సైని పిలిపించి తీవ్రంగా మందలించినట్టు సమాచారం. కాగా.. అతను రైడీషీటర్ అనే విషయం తనకు తెలియదని సంజాయిషీ ఇచ్చుకున్నట్టు తెలిసింది.

గంజాయి విక్రయిస్తున్న ఎక్సైజ్ ఉద్యోగి అరెస్ట్

గిర్మాజీపేట, మార్చి 5: గంజాయి విక్రయిస్తున్న ఎక్సైజ్ శాఖ ఉద్యోగిని అరెస్ట్ చేసిన ఘటన మంగళవారం వరంగల్ ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహమ్మద్ జబ్బార్ అలీకి దుబారా ఖర్చులతో వచ్చే జీతం సరిపోవడం లేదు. దీంతో తాను పనిచేస్తున్న ఠాణాలో సీజ్ చేసి నిల్వ ఉంచిన గంజాయిని దొంగిలించాడు. వరంగల్ బస్టాండ్ పరిసరాల్లో విక్రయించే యత్నంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు సిబ్బంది పట్టుబడ్డాడు. గంజాయి విక్రయించడానికి వచ్చినట్టు అంగీకరించాడు. నిందితుడితోపాటు 1.090 కిలోల ఎండు గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, మార్చి 5 : దవాఖాన సూపరింటెండెంట్, ఎస్సైల వేధింపు వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో తీసుకుని ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. స్థానిక సివిల్ దవాఖానలో శ్రీనివాస్ అటెండర్‌గా పనిచేస్తున్నాడు. అతడి కుమారుడు జయంత్ (22) కూడా అదే దవాఖానలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని జయంత్‌పై సూపరింటెండెంట్ రఘునాథ్ ఇబ్రహీంపట్నం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. దీంతో జయంత్‌పై కేసు నమోదు కాగా రఘునాథ్ అతడిని విధుల నుంచి సస్పెండ్ చేశాడు. తీవ్ర మనస్తాపం చెందిన జయంత్ మంగళవారం ఇబ్రహీంపట్నం బైపాస్ రోడ్డులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల పంపిణీపై విజి‘లెన్స్’

సమగ్ర విచారణకు సీఎం రేవంత్ ఆదేశం
ఏప్రిల్ నుంచి పాడి రైతులకు ప్రోత్సాహకం
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ నియామకాలకు వెయిటేజీ

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గొర్రెలు, చేప పిల్లల పంపిణీ పథకాల అమలుపై విజిలెన్స్ విచారణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పథకాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు లబ్ధిదారుల ఎంపిక, గొర్రెల కొనుగోలు, వాటిని పంపిణీ చేసిన తీరుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎక్కడైనా అవినీతి, అవకతవకలు జరిగినట్టు తేలితే వెంటనే ఆ వివరాలను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు అప్పగించాలని తెలిపారు. సచివాలయంలో మంగళవారం ఆయన పశు సంవర్ధక, పాడి, మత్స్య అభివృద్ధి శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గొర్రెల పంపిణీ పథకం అమలులో అవకతవకలు జరిగినట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇటీవల తన నివేదికలో పేర్కొన్న విషయాన్ని సీఎం ఈ సమావేశంలో ప్రస్తావించారు. గొర్రెల పంపిణీకి సంబంధించిన నిధులను కొందరు ఉద్యోగులు బినామీ పేర్లతో సొంత ఖాతాలకు మళ్లించుకున్నారన్న కేసులో ఏసీబీ దర్యాప్తుపై ఆయన స్పందిస్తూ.. శాఖాపరంగా సేకరించిన వివరాలపై ఆరా తీశారు. గొర్రెల పంపిణీ పథకానికి తొలి విడతలో రూ.3,955 కోట్ల రుణం ఇచ్చిన నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) రెండో విడత రుణాన్ని ఎందుకు నిలిపివేసిందని రేవంత్ ప్రశ్నించగా.. అప్పటికే కాగ్ ఈ పథకం అమలులో అవకతవకలు జరిగినట్టు గుర్తించి, అభ్యంతరాలను లేవనెత్తిందని, అందుకే రెండో విడత రుణాన్ని ఎన్‌సీడీసీ ఇవ్వలేదని అధికారులు తెలిపారు. దీంతో ఇప్పటికే తమ వాటా కింద 25% మొత్తాన్ని డీడీల రూపంలో చెల్లించిన లబ్ధిదారులకు ఎందుకు గొర్రెలను పంపిణీ చేయలేదని సీఎం ప్రశ్నించారు. రెండో విడతలో 85,488 మంది తమ వాటా కింద 25% డబ్బు చెల్లించారని, వారు చెల్లించిన దాదాపు రూ.430 కోట్లు జిల్లా కలెక్టర్ల ఖాతాల్లోనే ఉన్నాయని, మరో 2,20,792 మంది లబ్ధిదారులు ఇంకా డబ్బులు కట్టలేదని అధికారులు చెప్పారు. దీంతో ఈ పథకం అమలు తీరుపై పలు అనుమానాలున్నాయని సీఎం పేర్కొంటూ.. సమగ్ర విచారణకు ఆదేశాలు జారీచేశారు.

ప్రతి మండలంలో పశు వైద్యశాల

రాష్ట్రంలోని ప్రతి మండలంలో తప్పకుండా ఓ పశు వైద్యశాల ఉండేలా చూడాలని, 91 కొత్త మండలాల్లోనూ వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మొబైల్ వెటర్నరీ క్లినిక్ సేవలను కొనసాగించాలని, అందుకు అవసరమైన టెండర్లను వెంటనే పిలవాలని అన్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువైద్య విభాగంలో ఏండ్ల తరబడి పనిచేస్తున్నవారికి టీఎస్పీఎస్సీ చేపట్టిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలన్న ప్రతిపాదనను పరిశీలించాలని, వైద్యారోగ్య శాఖలో అమలైన వెయిటేజీ విధానాన్ని ఈ విభాగంలోనూ అమలు చేసేలా చూడాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పశు సంవర్ధక శాఖ స్పెషల్ సీఎస్ అధర్ సిన్హా, పాడి పరిశ్రమ శాఖ డెయిరీ డైరెక్టర్ లక్ష్మి, మత్స్య పరిశ్రమ శాఖ డైరెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

లీటర్‌కు రూ.4

లీటర్ పాలకు రూ.4 చొప్పున పాడి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని మూడేండ్లుగా ఇవ్వకపోవడంతో దాదాపు రూ.203 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని అధికారులు ఈ సమావేశంలో వివరించారు. చెప్పారు. దీనిపై సీఎం రేవంత్ స్పందిస్తూ.. పాడి రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాన్ని ఏప్రిల్ నుంచి క్రమం తప్పకుండా విడుదల చేయాలని, ప్రతి నెలా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

కాళేశ్వరం కింద కాలువలు ఎక్కడ తవ్వుదాం?

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు కింద తక్కువ ఖర్చుతో కాలువలు తవ్వి, సాగునీరు అందించేందుకు ఎక్కడెక్కడ అవకాశాలు ఉన్నాయో పరిశీలించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. త్వరలో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం జలసౌధలో కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారు. సాగునీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్‌తో ప్రాజెక్టుల సీఈలు, ప్యాకేజీల వారీగా పలు అంశాలపై చర్చించారు.

నేడు రాష్ట్రానికి ఎన్‌డీఎస్‌ఏ బృందం

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సమస్యలను గుర్తించి పునరుద్ధరణ చర్యలకు సిఫార్సులు చేసేందుకు నియమించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ బుధవారం రాష్ట్రానికి రానున్నది. రెండు రోజులపాటు ప్రాజెక్టులను పరిశీలించనున్నది. కేంద్ర జల్ సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ చైర్మన్‌గా ఐదుగురు సభ్యుల బృందం మూడు బ్యారేజీలపై సమగ్ర అధ్యయనం కోసం సంబంధిత ఏజెన్సీలు, అధికారులతో చర్చించి బరాజ్‌ల హైడ్రాలిక్, స్ట్రక్చరల్, జియోటెక్నికల్ అంశాలను నిర్ధారించనున్నారు. నాలుగు నెలల్లోగా నివేదికను సమర్పించాలని ఎన్‌డీఎస్‌ఏ ఆదేశించింది.

కాజీపేట రైల్వే జంక్షన్‌లో అగ్ని ప్రమాదం

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్‌లోని రైల్వే గూడ్స్ యార్డులో మంగళవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రైల్వే ప్లాట్‌ఫామ్‌కు అతి సమీపంలో గూడ్స్ యార్డులోని పట్టాలపై నిలిచి ఉన్న పాత రైలు బోగీలకు మంటలు అంటుకున్నాయి. రైల్వే అధికారుల నుంచి సమాచారం అందుకున్న ఫైర్ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను ఆర్పారు. మంటలు అదుపులోకి రావడంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో దాదాపు రూ.50 లక్షల వరకు రైల్వేకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చునని ప్రాథమికంగా అంచనా వేసినట్టు అధికారులు తెలిపారు.

ఎంపీ అర్వింద్ దుర్మార్గుడు

- కాషాయం కప్పుకున్న కసాయి
- ఎంపీగా పోటీకి అనర్హుడు
- పార్టీ టికెట్ ఇవ్వడం తప్పు
- బీజేపీ కార్పొరేటర్ దంపతుల వ్యాఖ్య
- సొంత పార్టీలోనే ఎంపీకి నిరసన సెగ
- బీజేపీ నుంచి కార్పొరేటర్ సస్పెండ్

మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ కార్పొరేటర్ సవిత, భర్త శ్రీనివాసరావు

వినాయక్‌నగర్, మార్చి 5: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అహంకారి, దుర్మార్గుడు అని బీజేపీ నేత మీసాల శ్రీనివాసరావు, ఆయన సతీమణి, నిజామాబాద్ 19వ డివిజన్ కార్పొరేటర్ సవిత విమర్శించారు. అర్వింద్ కాషాయం కప్పుకున్న కసాయి అని, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి అనర్హుడని మండిపడ్డారు. అర్వింద్‌కు టికెట్ ఇవ్వొద్దని రాష్ట్ర పార్టీ నేతలకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, దీంతో నేరుగా అధిష్ఠానానికి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వెళ్లిన శ్రీనివాసరావు అక్కడ మంగళవారం మీడియాతో మాట్లాడారు. మరోవైపు, అర్వింద్‌పై నిరసన గళం విప్పిన శ్రీనివాసరావు దంపతులను పార్టీ సస్పెండ్ చేసింది.

నిజామాబాద్ వాసులు.. అర్వింద్ బాధితులు

నిజామాబాద్ ప్రజలు అర్వింద్ బాధితులని దంపతులు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఇంత టెంపర్ ఉన్న వ్యక్తి మరొకరు లేరని, అలాంటి వ్యక్తికి మరోసారి టికెట్ ఇచ్చి బీజేపీ తప్పు చేసిందని మండిపడ్డారు. ఆయనకు బదులు డేరాబాబా, నిత్యానందకు టికెట్ ఇచ్చినా తాము ఇక్కడి (ఢిల్లీ)కి వచ్చేవాళ్లం కాదని తెలిపారు. నిజామాబాద్‌లోని 17 లక్షల మంది ఓటర్ల కోరిక మేరకు అభ్యర్థిని మార్చాలని, అర్వింద్‌కు టికెట్ ఇవ్వొద్దని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని తెలిపారన్నారు. రాష్ట్ర నాయకత్వం నుంచి సరైన సమాధానం రాక మోదీ, అమిత్‌షా సహా జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు చేయడానికి వచ్చామని చెప్పారు. అర్వింద్‌కు టికెట్ ఇస్తే బీజేపీకి నష్టం జరుగుతుందని తెలిపారు. అర్వింద్‌కు దమ్ముంటే స్వతంత్ర అభ్యర్థిగా గెలవాలని సవాల్ చేశారు. ఎంపీకి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు.

సస్పెన్షన్ వేటు..

అర్వింద్‌కు వ్యతిరేకంగా గళమెత్తిన సీనియర్ నేత శ్రీనివాసరావు, కార్పొరేటర్ సవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ నిబంధనలు ఉల్లంఘించి, పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో సస్పెండ్ చేస్తున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లిలోని విత్తనాల దుకాణంఎదుట ధర్నా చేస్తున్న రైతులు

నకిలీ విత్తనాలపై రైతుల ఆగ్రహం

న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటాం
దుకాణం ఎదుట పురుగు మందు డబ్బాలతో ఆందోళన

ములకలపల్లి, మార్చి 5: నకిలీ విత్తనాలతో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తాళ్లపాయకు చెందిన గిరిజన రైతులు మంగళవారం ములకలపల్లిలోని బాలాజీ ఫర్టిలైజర్స్ ఎదుట పురుగు మందు డబ్బాలతో బైఠాయించి ఆందోళన నిర్వహించారు. గ్రామానికి చెందిన 20 మంది రైతులు 40 ఎకరాల్లో యాసంగి వరి సాగు కోసం బాలాజీ ఫర్టిలైజర్స్‌లో నాగార్జున సీడ్స్ వారి హెచ్‌ఎంటీ సోనా, ఆర్‌ఎన్‌ఆర్ వరి విత్తనాలు కొనుగోలు చేశారు. వాటిని సాగు కోసం వినియోగించగా.. వయసు రాకముందే ఈనింది. ఇప్పుడు పొలం అంతా తాలు కంకులు వేసింది. దీంతో నష్టపోయిన రైతులు తమకు న్యాయం చేయాలని పురుగు మందు డబ్బాలతో దుకాణం ఎదుట ఆందోళన నిర్వహించారు. పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని రైతులు పేర్కొన్నారు. పది రోజుల క్రితం బాధిత రైతులు స్థానిక ఎమ్మెల్యేను కలిసి తమ గోడు విన్నవించుకున్నా.. నష్టపోయిన పంటలను, రైతులను కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నది. సంబంధిత అధికారులు స్పందించి బాధిత రైతులకు న్యాయం చేయాలని రైతులు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

డీఎస్సీకి టెట్ గండం

మొదటిపేజీ తరువాయి...

చేపడుతున్నారు. ఇటీవలే 11,062 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ పేరుతో నోటిఫికేషన్‌ను విడుదల చేసింది సర్కారు. అయితే గతంలో డీఎస్సీకి ముందు టెట్‌ను నిర్వహించేవారు. కానీ ఇప్పుడు టెట్ లేకుండా డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీచేశారు. దీంతో గతంలో టెట్ రాసి క్వాలిఫై కాని వారు ఇటీవలి కాలంలో డీఎడ్, బీఎడ్ పూర్తిచేసినవారు తమకు అవకాశం కల్పించాలని రోడ్డెక్కారు. ఇటీవలే అభ్యర్థులంతా పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ (డీఎస్‌ఈ)ను ముట్టడించారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో తమ ఆందోళనలను తీవ్రతరం చేశారు.

ఇంత కన్నా అన్యాయముంటుందా..?

బీఎడ్ ఫైనల్ ఇయర్, ఫైనల్ సెమిస్టర్ చదువుతున్నవారు స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్నిచ్చారు. డీఎడ్ రెండో సంవత్సరంలోని వారు సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే సర్టిఫికెట్ వెరిఫికేషన్ నాటికి అన్ని రకాల అర్హతలనూ పొంది ఉండాలని నిబంధనల్లో పేర్కొన్నారు. కానీ టెట్ విషయానికి వచ్చేసరికి టెట్‌లో అర్హత సాధించాలని నిబంధనల్లో పేర్కొన్నారు. అంటే అభ్యర్థులు డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చేనాటికే టెట్‌లో క్వాలిఫై ఉండాలి. దీనికి కొనసాగింపుగా డీఎస్సీ ఆన్‌లైన్ దరఖాస్తులో టెట్ మార్కులు అప్‌లోడ్ చేయాలన్న నిబంధన విధించారు. ఇలా రెండు విరుద్ధమైన నిబంధనలు ఒకే నోటిఫికేషన్‌లో గమనార్హం. ఇంత కన్నా అన్యాయమేముంటుందని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

టెట్ గత ఉత్తీర్ణత శాతం ఇలా

సంవత్సరం	పేపర్-1	పేపర్-2
2011	44.27	49.68
2012	44.43	47.02
2012	45.39	46.56
2014	61.86	28.56
2016	54.45	25.04
2017	57.37	19.51
2022	32.68	49.64
2023	36.89	15.30

ఉత్తీర్ణత శాతం తక్కువతో తిప్పలు

ఇక టెట్ పరీక్ష ఎప్పుడూ అభ్యర్థులను టెన్షన్ పెడుతున్నది. ముఖ్యంగా ఎస్‌ఏ జీవశాస్త్రం, భాషాపండితులు తమకు సంబంధం లేని సబ్జెక్టులను టెట్ కోసం చదవాల్సిరావడంతో, వాటిపై అవగాహన లేక తీరా పరీక్షల్లో బోల్తా పడి టెట్‌లో క్వాలిఫై కాలేకపోతున్నారు. ఇక పేపర్-2లో 2014 నుంచి ఇప్పటివరకు ఒక్క 2022 మినహా ఎప్పుడూ 30 శాతం లోపే అభ్యర్థులే ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది నిర్వహించిన టెట్‌లో 15 శాతమే ఉత్తీర్ణత నమోదయ్యింది. ఈ నేపథ్యంలోనే టెట్‌ను మరోసారి నిర్వహించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

అభ్యర్థుల డిమాండ్లు ఇవీ..

- గతంలో టెట్ ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉంది. అనేక మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఈ దృష్ట్యా టెట్‌ను నిర్వహించాలి.
- ప్రభుత్వం ఇటీవలే వయోపరిమితిని 46 ఏండ్లకు పెంచింది. మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తుందన్న నమ్మకం లేదు. అప్పటికి మా వయోపరిమితి పూర్తవుతుంది. కనుక ఇప్పుడే అవకాశం కల్పించాలి.
- అవకాశముంటే టెట్, డీఎస్సీ రెండింటిని ఒకేసారి నిర్వహించాలి.
- లేదంటే డీఎస్సీ ఇప్పుడు నిర్వహించినా.. ఫలితాలు ఆపి టెట్‌ను నిర్వహించి, టెట్ ఫలితాలు ప్రకటించి, ఆ తర్వాత తుది ఫలితాలు ప్రకటించాలి.
- గురుకుల రిక్రూట్‌మెంట్‌లో ఫలితాలు ప్రకటించిన తర్వాత టెట్ మార్కులు అప్‌లోడ్ చేసే అవకాశాన్నిచ్చారు. ఇదే విధానాన్ని తాజా డీఎస్సీకి వర్తింపజేయాలి.

టెట్ నిర్వహించాల్సిందే

గతంలో టెట్ పేపర్లు కఠినంగా ఇచ్చారు. దీంతో చాలా మంది క్వాలిఫై కాలేదు. కొంత మంది క్వాలిఫై అయినా తక్కువ మార్కులే తెచ్చుకున్నారు. డీఎస్సీలో టెట్ వెయిటేజీ అమలుచేస్తున్నారు. ఇలాంటప్పుడు టెట్ స్కోర్ ముఖ్యం. కావున టెట్‌ను నిర్వహించాల్సిందే. కేసీఆర్ సర్కారు 5 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తే 21 వేల ఖాళీలున్నాయని, ఇది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ అని రేవంత్ రెడ్డి మాట్లాడారు. మరిప్పుడు 21 వేలకు ఎందుకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. పాత వాటికి ఆరు వేల పోస్టులే ఎందుకు కలిపారు. అధికారంలోకి రాకముందు నిరుద్యోగులను కాంగ్రెస్ నేతలు మభ్యపెట్టారు. ఏజెన్సీ ప్రాంత పోస్టులను గిరిజన డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీచేయాలి.

- భుక్యా కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

చదువులు పక్కనపెట్టి రోడ్డెక్కే పరిస్థితి తెచ్చారు

ఎస్జీటీ ఉద్యోగం కోసమనే నేను డీఎడ్ సెకండియర్ చదువుతున్నా. త్వరలో మెగా డీఎస్సీ వేస్తారు.. ఈ సారి టీచర్ ఉద్యోగం కొట్టాలని రాత్రింబవళ్లు ప్రిపేరవుతున్నా. టెట్ నిర్వహించకుండా ప్రభుత్వం హడావుడిగా నోటిఫికేషన్ జారీచేసింది. ఇది ఎంతవరకు న్యాయం. టెట్ లేకపోవడంతో ఇప్పుడు డీఎస్సీకి అవకాశం లేకుండాపోయింది. దీంతో మేం వారం రోజులుగా చదువులు పక్కనపెట్టి రోడ్డెక్కాల్సిన పరిస్థితి తలెత్తింది. భవిష్యత్తులో డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు జారీచేస్తారో.. ఇన్నీ ఉద్యోగాలుంటాయో లేదో తెలియదు. కావున ఇప్పుడు టెట్ తర్వాతే డీఎస్సీని నిర్వహించాలి.

- సందేశ్, హైదరాబాద్

అర్హులందరికీ గృహజ్యోతి ఇవ్వాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

రాశారు. కేవలం 200 యూనిట్ల వరకు వినియోగించిన వారికే అధికారులు జీరో బిల్లు ఇస్తున్నారని, ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా సరే, మొత్తం 201 యూనిట్లకు బిల్లు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు ప్రతిరోజూ తాము ఎంత కరెంటు వాడుతున్నామో, మీటర్ ఎంత తిరుగుతున్నదో లెక్కలేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఫ్యాన్ వేసుకోవాలా? వద్దా? లైట్ వేసుకోవాలా? వద్దా? అనేది మీటర్ రీడింగ్ చూసి నిర్ణయించుకోవాల్సిన దుస్థితికి పేదలను నెట్టడం బాధాకరమని పేర్కొన్నారు. 200 యూనిట్ల కన్నా ఎక్కువ కరెంటు వాడినప్పటికీ, పై యూనిట్లకు మాత్రమే బిల్లు వేసే విధంగా నిబంధనలు రూపొందించాలని విజ్ఞప్తిచేశారు. 200 యూనిట్లు దాటితే, 200 యూనిట్ల వరకు అయ్యే భారాన్ని ప్రభుత్వమే భరించి, మిగతా యూనిట్ల ధరను వినియోగదారుడు చెల్లించే విధంగా బిల్లింగ్ వ్యవస్థలో మార్పులు చేయాలని కోరారు. రాష్ట్రంలో 90 లక్షల మందికి తెల్లరేషన్ కార్డులు ఉంటే, ప్రభుత్వం 30 లక్షల మందికే ఈ పథకాన్ని అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. మిగిలిన 60 లక్షల మందికి తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో 30 లక్షల మంది పేదలు ఉంటే, 10 లక్షల మందికే పథకం అమలుచేయడంతో మిగతా వారికి నష్టం కలుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. కేవలం మూడో వంతు పేదలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తున్నదని తెలిపారు. ఒక రేషన్ కార్డు కింద ఒక కుటుంబాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారని అభ్యంతరం వ్యక్తంచేశారు. ఒక రేషన్ కార్డులో పేర్లున్న వారు రెండు మూడు కుటుంబాలుగా కూడా విడిపోయి బతుకుతున్నారని, వారు ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో, వేర్వేరు అంతస్థుల్లో ఉంటున్నారని వివరించారు. కానీ, ప్రభుత్వం వారందరినీ ఒకే కుటుంబంగా లెక్కగట్టి ఒక్కరికే పథకం వర్తింపజేస్తున్నదని విమర్శించారు. ఇది సరైన పద్ధతి కాదని, అన్ని కుటుంబాలకూ పథకాన్ని వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. నిజమైన పేదలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమైతే, మొత్తం 90 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి కలిగేలా చూడాలని కోరారు. అలా చేయని పక్షంలో ఈ పథకం కేవలం నామమాత్రంగానే మిగిలిపోతుందని, హామీల అమలుకు ప్రభుత్వమే తూట్లు పొడిచినట్టు అవుతుందని పేర్కొన్నారు. నిజంగా పేదలకు సాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే, వెంటనే పై మూడు విషయాల్లో తక్షణం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రహ‘దారి’ మళ్లింపు

మొదటిపేజీ తరువాయి...

వాటిలో నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట తదితర జిల్లాలకు చెందిన రోడ్లు అధికంగా ఉన్నాయి. కొత్తగా మంజూరు చేసిన 53 రోడ్లలో ఒక్క నల్లగొండ జిల్లాకే రూ.300 కోట్ల విలువైన 17 రోడ్లను కేటాయించగా.. ఖమ్మం జిల్లాకు రూ.200 కోట్లతో 7 రోడ్లు, సూర్యాపేట జిల్లాకు రూ.115 కోట్లతో 8 రోడ్లను మంజూరు చేశారు. దీంతో మొత్తం రూ.1,097 కోట్లలో రూ.615 కోట్లు ఈ మూడు జిల్లాలకే కేటాయించినట్టయింది. స్టేట్ హైవేలు, ప్రధాన రహదారుల అభివృద్ధికి ఉద్దేశించిన సీఎస్‌ఆర్ పథకం కింద జిల్లాల్లో ట్రాఫిక్ అవసరాలను బట్టి రోడ్లను మంజూరు చేయాల్సివుండగా.. రేవంత్ సర్కారు మాత్రం కొందరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలకే అత్యధిక రోడ్లను మంజూరు చేయడం గమనార్హం.

వివక్షకు తావివ్వని బీఆర్‌ఎస్ సర్కారు

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాంటి వివక్షను ప్రదర్శించలేదు. ప్రజల అవసరాలకు అనుగుణంగానే పలు పథకాలను చేపట్టింది. విపక్షాలు గెలిచిన నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలను ఆపలేదు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం వహించిన మధిర నియోజకవర్గంలోనూ అమలుచేయడమే ఇందుకు నిదర్శనం. రోడ్ల విషయంలోనూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇలాగే వ్యవహరించింది. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాల్లోనూ విరివిగా రోడ్లను అభివృద్ధి చేసింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బీఆర్‌ఎస్‌పై ఉన్న ద్వేషంతో ప్రజల అవసరాలను పట్టించుకోకుండా స్వార్థంతో వ్యవహరిస్తున్నది.

మంత్రి ఆదేశాలతోనే పనుల రద్దు

గత ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్ల రద్దుపై ఉన్నతాధికారులను వివరణ కోరగా.. మంత్రి ఆదేశాల ప్రకారమే రద్దు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం చెప్పిన పనులనే తాము చేపడతామని, రోడ్ల రద్దు, కొత్త రోడ్ల మంజూరులో తమ ప్రమేయం ఏమీ లేదని చెప్పారు. కొత్త రోడ్ల మంజూరులో నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు అధిక ప్రాధాన్యమివ్వడంపై మాట్లాడేందుకు వారు నిరాకరిస్తూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే తాము నడుచుకుంటున్నట్టు తెలిపారు.

రోడ్ల మరమ్మతుల్లోనూ వివక్షే

గత వర్షాకాలంలో వచ్చిన వరదల వల్ల రాష్ట్రవ్యాప్తంగా అనేక రోడ్లకు తీవ్రనష్టం వాటిల్లింది. దీంతో వాటి మరమ్మతులకు అప్పటి సీఎం కేసీఆర్ రూ.2,500 కోట్లు మంజూరు చేశారు. ఇందులో దాదాపు సగం పనులు పూర్తికాగా.. ఎన్నికల నేపథ్యంలో మిగిలిన పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన మరమ్మతు పనులను చేపట్టకుండా తాత్సారం చేస్తున్నది. పూర్తయిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు దాదాపు రూ.650 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. వాటిని పెండింగ్‌లో పెట్టింది. కొత్త పనులు చేపట్టకపోగా, గతంలో చేసిన పనులకు కూడా బిల్లులు మంజూరు చేయకుండా వివక్ష ప్రదర్శిస్తున్నది.

కొందరికే ‘జీరో’ బిల్లులు

- చాలా మందికి పాత పద్ధతిలోనే..
- ఆందోళనలో విద్యుత్తు వినియోగదారులు

కోల్‌సిటీ, మార్చి 5: 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించే వారందరికీ మార్చి నెల నుంచే జీరో బిల్లు వస్తుందని ప్రభుత్వం ప్రకటించినా.. చాలా మందికి పాత పద్ధతిలోనే బిల్లు వచ్చింది. రెండురోజుల నుంచి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని పలు ఏరియాల్లో విద్యుత్తు సిబ్బంది కరెంటు బిల్లులు ఇస్తున్నారు. వీరిలో కొందరికే జీరో బిల్లులు వస్తుండగా.. ఈ విషయమై విద్యుత్తు శాఖ సిబ్బందిని అడిగితే రేషన్‌కార్డు, ఆధార్‌నంబర్ ఎన్‌రోల్ కాలేదని, అందుకే పాత పద్ధతిలోనే బిల్లు వస్తున్నదని చెప్పారు. కార్పొరేషన్ కార్యాలయంలో మళ్లీ ప్రజాపాలన దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ప్రజాపాలన సభలో దరఖాస్తుతోపాటు రేషన్ కార్డు, ఆధార్‌కార్డులు సమర్పించామని, వాటిని ఏం చేశారని కార్పొరేషన్ సిబ్బందితో కొందరు వాగ్వాదానికి దిగారు.